


పై వరండాలో లైటు వేసి, కింద క్లినిక్ వైపు దారి తీసే మెట్లు బరువుగా దిగసాగింది సుభద్ర. ఈ వారణాశి నగరంలో కాలం వేగించటం కోసమని తెలుగు దేశం నుంచి వెలువడే పత్రికలన్నీ తెప్పించుకుని చదివినా, సాయంకాల మయ్యేసరికి ఆమెకు చిరాకెత్తి పోతుంది. అలాంటప్పుడు హృదయంలేని నాజూకుతనానికి సంకేతంగా తోచే ఆ భవనం గోడల్ని పిడికిలితో బాదాలనిపిస్తుంది ఒక్కొక్కసారి.

కింద కిటికీ ఊచల విూద గడ్డం ఆనించి నిలుచున్న నర్సు జ్ఞానమ్మ సైగ చెయ్యటంతో ఠక్కున ఆగిపోయింది సుభద్ర, సగం మెట్లు దిగిన తరవాత.

'రోజూ ఉన్న భాగవతమే' అన్నట్లు ఎదురు సైగ చేసి, పెదవి విరిచి, వెను తిరిగి మెట్లెక్కబోతున్న సుభద్రను రామగోపాల్ చూడనే చూశాడు. పిలవనే పిలిచాడు, రోజూ పిలిచినట్లు 'సుభా' అని కాదు, 'సుభద్రా' అని.

తను తరుచుగా కన్సల్టింగ్ వేళల్లో క్లినిక్ వైపు రావటాన్ని అంగీకరించని

భీష్మించి, పంతంగా ఆయన్ని బాధ పెట్టటం కోసమని ఆ దరిదాపుల్లో ఉండకుండా ఈ ప్రాంతానికి వలస వచ్చినట్టు వచ్చి, వాళ్ళ సహవాసమే గిట్టదన్నట్టుగా ఉంటూ, అవీ చాల దన్నట్టుగా ఇంకా ఎన్నాళ్ళీ భేషజాలు? తన కొచ్చిన అవస్థ ఏమిటంటే, మానసికంగా తాను అనుభవించే హింసకు ఈయనలో కారణాల్ని వెదికి ద్వేషిద్దా మనుకుంటే, అదికూడా సాధ్యంకాకపోవ టం. అలా ద్వేషించగలిగితే, ఆ ద్వేషపు తీవ్రతలోంచి ఉత్పన్నమైన జీవశక్తితో ఈయన దృక్పథాన్నీ, ప్రవర్తననీ కొంత వరకైనా ఎదుర్కొన గలిగి ఉండునేమో తను? అది లేకపోవటంతో, బోనులో ముద్దాయిలాగా ఉండవలసి వస్తోంది.

''సారీ. ఆయనతో ఏదో చెప్పబోయి తికమకపడి మీ మీదికి మాట తెచ్చాను'' అంది జ్ఞానమ్మ అక్కడికి వచ్చి.

''ఫరవాలేదు, జ్ఞానమ్మా! ఇంతకన్నా ఘాటైన మాటలకే అలవాటు పడి మొద్దుబారి ఉన్నాన్నేను. . . ఇంతకూ ఇప్పుడీయన ఎదురుచూసే పేషెంటు ఎన్ని గంటలకొస్తాడట?''

''వస్తా'డు' కాదు, వస్తుంది. ముగల్ సరాయ్‌నుంచి. ఎవరో గాని, మతి సరిగా లేదట్లే ఉంది. అలాంటి వ్యక్తికి ముఖ్యంగా ఆ మనిషి స్త్రీ అయినప్పుడూ ఇంటర్వ్యూ ఇవ్వటం మంచిది కాదని చెప్పాను.''

''ఏం?''

''అదేమిటి—మా సంభాషణ మీరు పూర్తిగా వినలేదా?'' అంటూ ఆశ్చర్య పడింది జ్ఞానమ్మ. ''నే చెప్పాను: వైద్యానికి సంబంధించినంతవరకూ మన దగ్గరికి ఎవరు, ఏ సమయంలో వచ్చినా సేవ చేద్దాం, వద్దనను. కాని, వాళ్ళ వ్యక్తిగత సమస్యలూ, బాధలూ, నిరాశలూ చర్చించి ఓదార్చేందుకు మనం సైకియాట్రిస్టులమా? స్వాములవార్లమా? కాని, ఆయనేమో, మనస్సు మంచీ శరీరాన్ని విడదీయ లేమంటాడు. ఒప్పుకున్నాను. కాని, ఇప్పుడు వచ్చే మనిషి లాంటి వాళ్ళ వల్ల వాళ్ళ సమస్యల్ని తీర్చటం కాదు కదా, మనమే సమస్యల్లో ఇరుక్కుంటామని మొత్తుకున్నాను. తండ్రిని తల మీద కొట్టేవాడు మామకు మంగళహారతిస్తాడా అన్నట్టు, చేసుకున్న మొగుణ్ణే గొంతు పిసక బోయిన మనిషట ఆవిడ—మనల్ని మాత్రం మన్నిస్తుందని నమ్మకమేమిటి?''

ఆదిరిపడింది సుభద్ర. ''నిజమా?!''

''డాక్టరుగారే చెప్పారండీ. . . అప్పుడామె భర్త చటుక్కున వదిలించుకుని ఆమె రెండు చేతులూ పట్టుకుని దూరంగా తోసేశాడట. లేకపోతే. . .''

సుభద్ర మనసులో మునుపటి ఆలోచనలన్నీ మాయమై వాటి స్థానే భర్త విషయంలో ఆదుర్దా చోటు చేసుకుంది. ఎవరో ఆ దిక్కుమాలిన మనిషికి బాధలు వెళ్ళబోసుకునేందుకు ఈయనే దొరకాలా? ముగల్‌సరాయ్ నుంచి ఆ మనిషిని తీసుకొచ్చే రైలో, టాక్సీయో దారిలో ఆగిపోతే, లేదా, ఏక్సిడెంటయితే ఎంత బాగుండును! ఇది చెడ్డ తలపే కావచ్చు. కాని, తన భర్తను ప్రమాదానికి గురి చేసే పరిస్థితి తప్పిపోతే చాలు—ఆ మంచి చెడ్డలతో తనకు నిమిత్తం లేదు.

ఇంతలో కింద వరండా ముందు ఓ టాక్సీ వచ్చి ఆగటంతో, మాట్లాడుతున్న జ్ఞానమ్మ హడావిడిగా లేచి వెళ్ళింది. సుభద్ర ఆందోళనతో, ఉద్వేగంతో కింది వరండా చుట్టూ ఉన్న మెట్ల వైపు చూస్తోంది. మెట్ల మీది మొజాయిక్ ఫ్లోరింగ్ విద్యుత్కాంతిని మింగి గుడ్డ మిటకరిస్తోంది.

ఆకుపచ్చ సిల్కు చీరా, దాని మీద పొడవైన మబ్బురంగు ఉలెన్ స్వెట్టరూ, భుజానికి వానిటీబాగూ ధరించిన ఒక స్త్రీ టాక్సీలోంచి దిగింది. దిగుతూనే డ్రైవరుతో ''ఫిర్ ఆధే గంటేమే ఆవుంగీ. యహీరహో'' అని చెప్పి, వరండా మెట్లెక్కుతూ, పైన మనిషి అలికిడికి తలఎత్తి ఒక్షణం సేపు చూసింది. ఆ క్షణంలో ఆమె రూపం సుభద్ర మనస్సు మీద స్పష్టంగా హత్తుకుంది: సన్నని నదిలాంటి తల పాపిట లోంచి దూకి విశాలంగా పరుచుకుంటున్న పచ్చని నుదురులో ఏదో జిజ్ఞాస, కన్నుల్లో అస్పష్టత, పెదాల మీద అనుభవాల తీవ్రత. ఆమనిషిలోఏదోఅసాధారణత్వాన్నీ, ఆ మనిషి మనోధర్మంలో ఏవో రుగ్మతల్నీ ఊహించుకుంటూంది సుభద్ర.

గోపాల్ చెప్పిన ప్రకారం ఆ మనిషిని ఆహ్వానించి వరండాలో కూర్చో బెట్టింది జ్ఞానమ్మ. ''కాస్సేపట్లో డాక్టరుగారు పిలుస్తారు'' అంటూ లోపలికి వెళ్ళి ఫ్లాస్కులోంచి టీ కప్పులో పోసుకొచ్చి ఇచ్చింది.

''ఆలస్యం లేదు కదా. . . త్వరగా వెళ్ళాలి నేను'' అంటూంది దామె టీ తాగుతూ.

'తెలుగు మనిషే నన్న మాట' అనుకుంది సుభద్ర. కాని, ఆ మనిషి ధోరణి వింతగా తోచింది. ముఖ్యమైన విషయాలు మాట్లాడ్డానికంటూ వచ్చి, తిరిగి వెళ్ళటానికి నిమిషాలు లెక్క పెట్టుకుంటూ కూర్చోవటం అదో రకం చాంచల్యమో, లేక ఈ డాక్టరు సత్తా తేల్చుకు పోవాలన్న గండాగొండితనమో అర్థం కావటం లేదు. ఇలాంటి వాళ్ళ విషయంలో కాస్త జాగ్రత్తగానుండద్దూ? ఆ మనిషి భుజానికున్న ఆ వానిటీ బాగ్‌లో చిన్న రివాల్వరు లాంటిదేమైనా ఉండదని ఎవరు చెప్పగలరు?

ఈ ఆలోచన సుభద్రను కుదిపింది. ఇలాంటి సన్నివేశాల్లో తను క్లినిక్‌ఛాయల్లో నైనా ఉండటాన్ని భర్త సహించడని తెలిసినా, ఆ భర్త క్షేమం కోసం అలాంటి నియమాలన్నీ ఉల్లంఘించ దలుచుకుంది ఆమె. సద్దు లేకుండా మెట్లు దిగి వెళ్ళి క్లినిక్ పక్క ఇవతలి గదిలో కిటికీ కింద చీకట్లో ముడుక్కుని కూర్చుంది.

ఆ పాటికి జ్ఞానమ్మ తన డ్యూటీ పూర్తి చేసి వెళ్ళిపోయినట్లుంది. ఆ కొత్త స్త్రీ తనని 'రమాదేవి' అని గోపాల్‌కు పరిచయం చేసుకుని, ఆయన్ని గురించి తనకు ముగల్‌సరాయ్‌లో ఇరుగు పొరుగున ఉన్న హిందీ వాళ్ళు చెప్పారనీ, అయినా, ఈ క్షణం వరకూ ఆయన తెలుగువాడని తనకు తెలియదనీ చెబుతూంది. ఆ తరవాత తనకు ముగల్ సరాయ్‌లో రైలు తప్పిపోయి, టాక్సీ దొరక్కపోగా, వ్యాస్‌నగర్ దాకా ఓ కారులో లిఫ్టు తీసుకుని అక్కణ్ణుంచి టాక్సీ కుదుర్చుకునేందుకు ఎంత కష్టపడిందీ వివరిస్తూంది. బయట వీధిలో కార్లూ, బస్సులూ, మనుషులూ చేసే రొద ఎక్కువగా ఉన్నా, రమాదేవి మాటలు స్పష్టంగానే వినబడుతున్నాయి సుభద్రకు.

గోపాల్ అంటున్నాడు:

''మీరు కూర్చుని ఉన్న సోఫా పాండవులకు దొరికిన సత్యపీఠం వంటిది కాకపోవచ్చు. కాని, ఎందరో స్త్రీలూ, పురుషులూ దానిమీద నిర్భీతిగా విశ్రమించి, రాబోయే శుభోదయాల మీద ఆశలు పునరుద్ధరించుకున్నారు; అంతరంగాల చుట్టూ ఉన్న పరిధుల్ని వదిలించుకున్నారు. అలాంటి క్షణాల్లో నేను చూసేదల్లా, ఇతరుల జీవితాల్లోకి తొంగి చూద్దామన్న గడుసు కుతూహలం కాదు; తోటి ఆర్తుడుగా వాళ్ళ వేదనల్ని పంచుకుందామన్న ఆశ మాత్రమే. . .''

వరండాలోని లైట్లు గది లోపలికి ప్రసరించేగుడ్డివెలుతురులోంచి చీకట్లోకి ఒదుగుకుంటూ కూర్చున్న సుభద్ర నీరసంగా నవ్వుకుంది. ఈయన ఆర్తుడా? ఈయన ఆర్తి తనతో కలిసి జీవించవలసి రావటమేనా? అయినా, ముక్కూ మొహం తెలియని మనిషి ముందు అలా సొంత గొడవల దస్త్రరం విప్పటం అవసరమా?

ఏదో పాత జ్ఞాపకాల మడతల్లోంచి పూర్వపు గోపాల్‌ను చూస్తూంది ఆమె. అప్పట్లోనే, తను పెళ్ళి ప్రస్తావన రాకపూర్వం, ఒక మారు ఏదో పార్టీకని



భామ — బరువు
నవీన్ కుమార్ సిలాస్ (సికందరాబాదు)

పిలిస్తే వచ్చి తమ ఇంట్లో అందరికీ పరిచయమయ్యాడతను. తనకి ఫోటోగ్రఫీ అంటే సరదా అని చెప్పాడు. ఫోటోలు తీయగలిగినా, అతడికి తన కున్నట్టుగా ఎక్స్ రే కళ్ళున్నాయా? అనుకుంది తను ధీమాగా. ఆ సమయంలో అతడి అంతరంగమంతా ఆ నొసటి మీదా, బుగ్గల మీదా, ఏమీ దాచలేని అతడి కనుపాపల మీదా అద్దిఉన్నట్టుగా తోచింది. ఇప్పుడాయన అనుభవిస్తున్నానని చెప్పే ఆ ఆర్తి కూడా అలా కనుపాపల్లో ప్రతిఫలిస్తున్నదా?

ఉత్కంఠ ఉక్కిరి బిక్కిరి చెయ్యగా, కూర్చున్న చోటునుంచి కొద్దిగా పైకి లేచి, వంగి, కిటికీ కర్టెను కొద్దిగా తొలగించి లోపలికి చూసింది సుభద్ర. ఆశ్చర్యపడింది.



ఏనాటి పౌరుషం    చిత్రం— బి. పి. రెడ్డి (హైదరాబాదు)

రాత్రివేళ అందునా చలికాలం— అయినా, గోపాల్ కళ్ళకు నల్లని కూలర్స్ తగిలించుకున్నాడు. ఆపరేషన్ చేసేటప్పుడు వేసుకునే మాస్కు ముఖానికి ధరించాడు. ఇదంతా తాను ఇప్పుడే ఆపరేషన్ థియేటర్‌లోంచి వస్తున్నట్టూ, మళ్ళీ వెంటనే అక్కడికి వెళ్ళవలసి ఉన్నట్టూ రమాదేవికి సూచించి త్వరగా పంపివెయ్యటానికా? మరి ఆ విషయం ఆమెకు సూటిగా చెప్పకుండా ఇంత హంగామా, నాటకీయతా దేనికి?

ఇలాంటి మథనతో లోపలి భయాల ఔద్ధత్యాన్ని తగ్గించుకో జూస్తున్న సుభద్ర క్లినిక్‌లో జరిగే సంభాషణని పూర్తిగా వినలేకపోతూంది. ఆమె మళ్ళీ సావధానురాలయ్యేసరికి, గోపాల్ కుర్చీలోంచి లేచి వెళ్ళి పక్కన సోఫాలో వేరగిలబడి మాట్లాడుతున్నాడు. ఆయన క్రాపులో నెరిసిన వెంట్రుకల పాయలు ఫానుగాలికి అల్లల్లాడుతున్నాయి. రమాదేవి ఎడమవైపు మూలగా కూర్చుని ఉందేమో— ఆమె సుభద్రకు కనబడటం లేదు. కాని, ఆమె గొంతు మాత్రం ఖంగుమని వినబడుతూంది.

"నాకు మాత్రం లౌక్యం తక్కువగా ఉన్న మనుషులతో జీవితాన్ని గాఢంగా అనుభవించగలరనిపిస్తుంది, డాక్టరుగారూ! కాని. . ." అంతలోనే ఖంగుమనే ఆ గొంతులో గాద్గద్యం ఆవహించింది. సుభద్ర కంగారుపడింది. ఈ రమాదేవి లాంటి వాళ్ళు ఎప్పుడూ అతిత ధ్రువాలమీద నడుస్తుంటారా ఏమిటి? అలాంటివాళ్ళు ఏ క్షణాన ఏం చేస్తారో చెప్పటం కష్టం.

రమాదేవి తేరుకుని మళ్ళీ అంది: "కాని. . . నా ఇష్టానికి వ్యతిరేకంగా నా జీవితంలోకి వచ్చిన మనిషి మాత్రం అలా కాదు. అతడికి డబ్బుంది. కాని, ధైర్యం లేదు. నిలువునా లౌక్యం. అన్ని ఆలోచనల మీదా ముసుగులు. నేనందుకు పూర్తిగా వ్యతిరేకం. మా పెళ్ళికి ముందే నా ఫ్రెండ్సు ద్వారా అతడికి చెప్పించాను, అతడితో కలిసి జీవించలేనని. అందుకు గల కారణాలేవీ అతడి దగ్గర దాచలేదు. కాని, అతడు వినలేదు. కసిగా నాపై హక్కు తీసుకుని విజయగర్వం పొందటానికేమో?

"సరే, పెళ్ళయింది. నలుగురి నోటి మాటలతో నా ఊహారాజ్యం విరిగిపోతుందన్న భయంతో దూరంగా ఉత్తరదేశానికి వెళ్ళి ఉందామని చెప్పాను. వద్దన్నాడు. ఎందుకు? మన ప్రాంతానికి దూరంగా ఉంటే నన్ను అశక్తురాలిని చెయ్యవచ్చునని. ఇక్కడికొచ్చినా ఇక్కడ ఎప్పుడూ ఏదో ప్లాను, మరింత డబ్బు సంపాదించటానికి. ఆ ప్లానులన్నీ నా దగ్గర రహస్యం. ఎందుకంటే, నన్నేదో మడి కట్టుకున్న దేవతావ్యక్తిలా ఊహించుకోవటం వల్ల. తను అలా డబ్బు వెంట పడిపోవటాన్ని నేను అసహ్యించుకుంటానని భయం. కాని, తన ప్రయత్నాలన్నీ నా దగ్గర దాచి, ఎలాగైనా తను డబ్బు మూటలు సంపాదిస్తే, ఆ అంతిమ ఫలితం చూసి నా కళ్ళు జిగేలుమనిపోయి, అప్పుడు తనని ఉన్నతుణ్ణి చేసి గౌరవిస్తానని లోలోపల ఆశ. . ."

"భార్య విషయంలో అలాంటి ఆశ ఉండటం తప్పంటారా?" అన్నాడు గోపాల్.

"తప్పున్నర."

"ఆవేశపడకండి."

"ఇలా ఆవేశపు ముద్ర వేసి కొట్టిపారెయ్యటం అన్యాయం, డాక్టరుగారూ! కాని, అన్యాయమని నేను చెప్పినా వినే వాళ్ళేరీ? . . ." ఏడుపుని దాచలేక పోతూందామె. విస్మితురాలై సుభద్ర మళ్ళీ కర్టెన్ సందులోంచి చూస్తే, లోపల గోపాల్ దెబ్బతిన్నట్టుగా నిలబడి ఉన్నాడు. రమాదేవి మళ్ళీ అంటూంది: "కాని, నా ఆవేశాలన్నీ నా అధీనంలో ఉన్నాయని మీ కందరికీ ఎలా చెప్పను?"

ఈ మాటల్లోని నిజాయితీ, బాధా శంకించరానివిగా తోచాయి సుభద్రకు. ఈమె వల్ల తన భర్తకు ఎలాంటి ప్రమాదమూ లేదు. సుభద్రకు ధైర్యాన్నిచ్చే మరొక విషయమేమిటంటే, ఇలాంటి మానసిక చికిత్సల్లో మామూలుగా పరుషంగా ఉండే తన భర్త ఈమెతో మృదువుగా, గొంతు మార్చి మాట్లాడుతూ ఉండటమూ, సలహాల రూపంలో ఏమీ చెప్పకపోవటమూ. ఇక ఆ సీ చీకట్లో కూర్చుని ఆదుర్దా పడటం అనవసరమే. కాని, కల్పిత కథలకన్నా చిత్రంగా ఉన్న ఈ రమాదేవి జీవన వృత్తాంతం పట్ల కుతూహలం సుభద్రను అక్కణ్ణించీ కదలనివ్వటం లేదు, అలా వినటం నాగరికత కాదనిపించినా.

"ఇప్పుడు మీ నుంచి రాగల ప్రశ్న నాకు తెలుసు" అంటూంది రమాదేవి.

"ఏమని?"

"ఆవేశాలు స్వాధీనంలో ఉంటే, మొగుణ్ణి గొంతు పిసకబోవటం ఎందుకని. . . డాక్టరుగారూ! నే ననుకుంటూ ఉంటాను— మనం అనుభవాలనుంచి ప్రోగు చేసుకునే భావోద్రేకాలు ఒక్కొక్క జీవితంలో ఒక్కొక్క క్షణాన పతాక స్థాయికి చేరతాయని. అలాంటి ఒకానొక క్షణంలోనే ఆ మనిషి మీద నేరు చేసుకున్నాను—'ఎన్నాళ్ళిలా అరువుబతుకు బతుకుతావయ్యా?' అని. ఆ దూకుడులో అతణ్ణి గొంతు పట్టుకుని ఊపింది నిజమే. చంపాలని కాదు. చంపటానికే నని నలుగురికీ చెప్పి ఆ మనిషి నన్ను పోలీసుల కెందు కప్పగించలేదు?"

వింటున్నాడు గోపాల్.

"ఎందుకంటే, అతడికి తెలుసు, అది అబద్ధమని. అయినా, అందరిలోనూ నా కలాంటి అపకీర్తి సృష్టించి, నన్ను ఒంటరిదాన్ని చేసి, నా స్పందనల్ని, ప్రతిఘటనల్ని అణిచి, నన్నుకూడా తన ఇరుకు దారిలోకి లాగి సంతోషించటం కావాలి అతడికి. కాని, నేను లొంగను."

"లొంగమని నేను సలహా ఇస్తేనో?"

"వినను."

ఎదురుచూడని ఈ జవాబుకు గోపాల్ అహం దెబ్బ తిన్నట్టుంది. అతడు వాదించ లేదు.

రమాదేవి మళ్ళీ అంది: "మిమ్మల్ని తప్పు పట్టాలని కాదు, డాక్టరుగారూ! కాని, ఒక విషయం అడుగుతాను చెప్పండి. నేను ఊహల్లో బతుకుతాను. అది తప్పంటారా? నేను ఇష్టపడే జీవితం ఆ ఊహల్లో ఉంది. చిన్నప్పటి మా ఊరు, ఊరి చివర్న ఒక స్వర్ణయుగం నాటి కోవెలా, ఆ కోవెల చుట్టూ తిరిగే నా కోరికలూ ఆ ఊహల్లో ఉన్నాయి. ఆ కోరికల పట్ల ఎంత గౌరవం ఆ రోజుల్లో! సాయంత్రం ఫ్రెండ్సుతో కలిసి కోవెల దగ్గిరికి షికారు వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు రాత్రికి బామ్మ చేసిన దొండకాయవేపుడూ, కొబ్బరికాయ పెరుగుపచ్చడీ గుర్తు కొచ్చి అడుగు ఎంత తొందరగా పడేదని!

"ఒక సాయంత్రం మాత్రం, అలా తొందరగా పడే అడుగులో తొట్రుపాటు కల్పించాడు, ఎక్కణ్ణుంచో అవతరించిన ఓ యువకుడు. మెడలో కెమెరా ఉంది. ఆ తరవాత వరసగా మూడు సాయంత్రాలు కనిపించి, నాలుగో సాయంత్రం దగ్గరగా వచ్చి చెప్పాడు—కర్నూల్లో మెడిసిన్ చదువుతున్నాడట. ఫొటోగ్రఫీ సరదాట. మా ఊరి కోవెలనీ, శిల్పాల్నీ ఫొటో తీసుకెళ్ళ ానికి వచ్చాడట.

"ఆ తరవాత మళ్ళీ ఏడాదికి మా ఊరు వచ్చి, ఓ సాయంత్రం షికారు నుంచి వచ్చే నన్ను ఆపి, 'ఈ మారు వచ్చింది ఆ శిల్పాల ఫొటోల కోసం కాదు. జీవమున్న ఈ శిల్పం కోసం' అని నన్ను చూపాడు. తన వాళ్ళెవరూ లేరనీ, ఆరు నెల్లకు తన ఫైనలియర్ కాగానే వచ్చి నన్ను తీసుకెళతాననీ అన్నాడు."

ఇది చెబుతూంటే రమాదేవి గొంతులో గాద్గద్యం లేదు, ఏ లోకాల్లోనో ఏపుగా పెరిగి ఈ లోకంలో విచ్చుకునే పూల తావిని ఆఘ్రాణిస్తున్నప్పటి పారవశ్యం తప్ప. కాని, ఆమెకు బదులు సుభద్ర చీకట్లో కన్నీళ్ళు వత్తుకుంది రమాదేవి కథలో తరవాతి భాగంలోని వ్యథలూ, నిరాశలూ ఊహించుకుంటూ.

"చూడండి, డాక్టరుగారూ! ఏ అపురూపమైన అనుభూతి కోసమో, లేదా ఏ పాదముద్రలు పడటానికో సన్నట్టు, ఒక్కొక్కసారి మనం అంతరంగాన్ని విప్పి పరుస్తాం. ఆ అనుభూతి రాకపోవచ్చు. ఆ క్షణం దాటి పోవచ్చు. కాని, వాటి దివ్య చిహ్నాలను తడవ కొక రకంగా ఊహిస్తూ బ్రతుకు వెళ్ళబూచ్చటంలో ఉన్న హాయి డబ్బులో, దర్జాల్లో ఉందంటారా?" అంది రమాదేవి. సుభద్ర ఆశ్చర్యపడుతూంది, మొగుణ్ణి చంపబోయిందన్న అపవాదుకు అన్యాయంగా గురి అయిన ఈ వెర్రి బాగుల మనిషిలో ఇంతటి ఊహా జీవి ఉందా అని. రమాదేవి మళ్ళీ అంది: "లేదని మీరు ఒప్పుకోకపోవచ్చు, ఆ డబ్బు, దర్జాల కోసం ఇంత దూరం వచ్చి ఉన్నారు గనక. . . అయినా, మీ పెద్దవాళ్ళు చాలా కాలంగా ఇక్కడ స్థిరపడ్డా రనుకుంటాను. అందుకేనేమో మీకు హిందీ వాళ్ళలా 'వేద్' అని పేరు పెట్టినట్టున్నారు."

ఇలాంటి సందర్భాల్లో, మహేశ్వరితో నైనా అయితే గోపాల్, తాను పెద్దవాళ్ళ హయాంలో కాకుండా తన హయాం లోనే ఇక్కడికి వచ్చి స్థిరపడ్డాననీ, 'వేదుల రామగోపాల్' అనే తన పేరును ఈ ప్రాంతానికి అనువుగా ఉండేటట్టుగా 'ఆర్. జి. వేద్' అని తిప్పుకున్నాననీ చెప్పి ఉండేవాడు. కాని, ఈ విచిత్ర వ్యక్తితో అదంతా చెప్పి సంభాషణ పెంచకుండా త్వరగా పంపివేద్దా మను కున్నాడో, లేక ఆమె సమస్యలు తన తీర్పుకు అందేవి కావనుకున్నాడో—మౌనం వహించాడు.

అయితే, రమాదేవి ఊరుకోలేదు. "ఇప్పుడు నా ఊహాలోకానికి భద్రంగా తలుపులు మూసి ఉంచి, అప్పుడప్పుడూ దానిలోకి నే నొక్కతెనే వెళ్ళి వస్తుం టాను. ఆ రోజు సాయంత్రం నాతో చెప్పిన ప్రకారం రామగోపాల్ తిరిగి రాలేదని అతణ్ణి తప్పు పట్టను. ఆ తరవాత నేను విన్నది వాస్తవమే అయితే, అతడు డబ్బుకూ, ఉద్యోగాలకూ భ్రమసి ఎవరో ప్రొఫెసరు కూతుర్ని పెళ్ళాడాడని జాలి పడతా నంతే."

సుభద్ర శిలాప్రతిమలా కూర్చుంది.

"నిజంగా జాలి పడతారా?" అంటు న్నాడు గోపాల్.

"నిజం. . . మొగుణ్ణి గొంతు పట్టుకున్న మనిషిలో అమాత్రం జాలి ఉంటుందా అని సందేహమా?"

"లేదు."

ఉద్విగ్నురాలైన సుభద్ర గభాలున క్లినిక్ లోపలికి దూసుకు వెళ్ళి నిలుచుం దామా అనుకుంది. కాని, అలా చేయటం అవివేక మనిపించి ఊరుకుంది.

రమాదేవి గోపాల్ వద్ద సెలవు తీసుకుంటూంది. సుభద్ర గబగబా వెళ్ళి కింది వరండాలో నిలుచుంది. మరి కాస్సేపటికి రమాదేవి క్లినిక్ లోంచి వరండాలోకి వస్తూ ద్వారానికి భుజం రాచుకుని తన వానిటీబాగ్ జార విడుచు కుంది. సుభద్ర వెళ్ళి ఆ బాగ్ తీసి ఆమెకు అందిస్తూ ఆప్యాయంగా ఆమె చెయ్యి పట్టుకుంది. ఆ వానిటీబాగ్‌లో రివాల్వర్ కాదు, చివరికి స్మెలింగ్‌సాల్ట్స్ కూడా ఉండదన్న దృఢ విశ్వాసం కలిగింది సుభద్ర కిప్పుడు.

"షుక్రియా" అని, అంతలోనే నాలుక కరుచుకుని, "సారీ, మీరు హిందీ వాళ్ళనే భ్రమ పోలేదు నా కింకా. . . థాంక్స్!" అంటూ అమాయికంగా వెళ్ళి టాక్సీలో కూర్చుంది రమాదేవి. టాక్సీ కదిలి వెళ్ళిపోయింది.

గోపాల్ బయటికి వచ్చి నిలుచున్నాడు.


"ఆదర్శాల్ని అంటి పెట్టుకోవటమో, వాస్తవాలతో రాజీపడటమో—ఏదో ఒకటి స్పష్టంగా చెయ్యాలి గాని, అటి కొంచెం, ఇటి కొంచెం అన్నట్టుగా చేస్తూ హింస ననుభవించటం, ఇతరుల్ని హింస పెట్టటం ఏం న్యాయం? నే నైతే ఇ. ఎస్. టి. పేపర్లో రావలసిన మార్కుల్ని ప్రేమకు పణంగా పెట్టి ఉండేదాన్ని" అని భర్తకు చెప్పగలిగితే బాగుండు ననుకుంది సుభద్ర.

కాని, అతడి విషయంలో తన కున్న జంకును కొద్ది కొద్దిగా జయిస్తూ, "ఆమె ముగల్‌సరాయ్ లో వచ్చి ఉంటు న్నట్టు మీ కెన్నాళ్ళుగా తెలుసు?" అని మాత్రం అడిగింది.

"ఆర్నెల్ల నుంచి."

"ఆ అమాయికురాలు మిమ్మల్ని పోల్చుకున్నట్టు లేదు" అం దామె, మెడ మెలికొత్తుకుంటూ.

"మరి నేను మాత్రం పోల్చుకో గలిగానా ఇన్నాళ్ళు? నాది ఎక్స్‌రే కళ్ళని భ్రమపడుతూ వచ్చా నంతే." ★



చాటు మాటు
నవీన్ కుమార్ సెలాన్
(సికిందరాబాదు)